

కిలో టమాట రూ.6
అనంతపురం కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్ట ధర రూ.6 పలికినట్లు అధికారులు తెలిపారు.



టన్ను చీనీ రూ.37 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.37 వేలు, కనిష్టంగా రూ.22 వేల ప్రకారం పలికాయి.

గరిష్టం/కనిష్టం
37.2°/22.4°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత అధికంగా ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా పంపిణీ



పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా నిధుల విడుదల కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక కలెక్టరేట్‌లో రెండో విడత నిధుల మంజూరు కార్యక్రమం ప్రారంభించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు వైఎస్సార్ కళ్యాణమస్తు , ముస్లిం యువతులకు వైఎస్సార్ షాదీ తోఫా కింద వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో ఆర్థిక సాయం జమ చేస్తామన్నారు. జిల్లాలో 440 మంది లబ్ధిదారులకు రూ.3,12,60,000 నగదుకు సంబంధించి మెగా చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందజేయనున్నారు. ఇందులో ఎస్సీలు 77 మంది, ఎస్టీలు 25 మంది, బీసీలు 264 మంది, మైనార్టీలు 66 మంది, దివ్యాంగులు 7 మంది, భవన నిర్మాణ కార్మికులు ఒకరున్నారు. ఇందులో కులాంతర వివాహాలు చేసుకున్న ఏడుగురికి రూ.5,70,000 మొత్తాన్ని అందజేయనున్నారు.

నేడు కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రాక



పంటను పరిశీలిస్తున్న డీపీఎం లక్ష్మానాయక్

మడకశిరరూరల్: మడకశిర మండలంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ కార్యదర్శి మనోజ్ అహుజా, కలెక్టర్ అరుణ్‌బాబు, రైతు సాధికార ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయకుమార్ పర్యటిస్తారని జిల్లా ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్ తెలిపారు. ఆయన గురువారం ఛత్రం గ్రామంలో పర్యటించి అధికారులు పరిశీలించే చోట ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మానాయక్ మాట్లాడుతూ శుక్రవారం ఉదయం ఛత్రం, బూదిపల్లి, రాళ్లపల్లి, మెళవాయి గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేసిన పంటలను అధికారులు పరిశీలించి వారి అభిప్రాయాలు తెలుసుకుంటారని పేర్కొన్నారు. అనంతరం మెళవాయి పాఠశాలలో రైతులు, ఎస్‌హెచ్‌జీ స్వయం సహాయక సంఘాల సభ్యులతో వేర్వేరుగా సమావేశమవుతారని వివరించారు.

13న జాతీయ లోక్ అదాలత్



అనంతపురం: కేసుల సత్వర పరిష్కారానికి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈ నెల 13న (రెండో శనివారం) జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి గరికపాటి దీనబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, చెక్ బౌన్స్, వినియోగదారుల ఫోరం, పంచాయతీ ట్యాక్స్, మున్సిపల్ ట్యాక్స్, ప్రిలిటిగేషన్, మోటారు వాహన ప్రమాద కేసులను జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు.

99 శాతం పింఛన్ల పంపిణీ



అనంతపురంలో చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న మల్లిరెడ్డికి పింఛన్ అందజేస్తున్న గువ్వలగుట్టపల్లి వలంటీర్ లక్ష్మి

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ జిల్లాలో జోరుగా సాగుతోంది. నాలుగోరోజు గురువారం నాటికి 99 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలోని 32 మండలాల పరిధిలోని 2,63,587 మంది లబ్ధిదారులకు రూ.73,18,35,000 నగదు మంజూరు చేశారు. వలంటీర్ల సహకారంతో నాలుగు రోజుల్లో 2,59,556 మందికి రూ. 72,06,41,250 నగదు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. శుక్రవారం చివరి రోజు పింఛన్ పంపిణీ ఉంటుందన్నారు.

పేదలకూ ప్రైవేటు విద్య!



చిత్రంలో కనిపిస్తున్న చిన్నారి పేరు జ్ఞాన దీపిక. తల్లి పేరు లక్ష్మీ నరసమ్మ. తండ్రి కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. లక్ష్మీ నరసమ్మ దిన కూలిగా పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. ఉన్న ఒక్క కూతురి చదువుపై ఆమెకు బెంగగా ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం ఆమెకు వరంగా మారింది. జ్ఞాన దీపికను ప్రైవేటు బడిలో చేర్పించేందుకు ప్రభుత్వ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోగా ధర్మవరంలోని యశోద కాన్సెప్ట్ స్కూల్‌లో సీటు దక్కింది. ప్రభుత్వ మేలును ఎన్నటికీ మరువనని లక్ష్మీనరసమ్మ హర్షం వ్యక్తం చేశారు.



- పక్కాగా నిర్బంధ విద్యా హక్కు చట్టం అమలు
- 25 శాతం సీట్లు ఉచితంగా కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు
- ముగిసిన మొదటి విడత ప్రవేశాలు
- 6 నుంచి రెండో విడతకు దరఖాస్తుల స్వీకరణ

ప్రశాంతి నిలయం: ఒకప్పుడు ఉన్నత వర్గాల పిల్లలకే కార్పొరేట్, ప్రైవేటు విద్య అందేది. అయితే రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు, సంక్షేమ పథకాలతో కార్పొరేట్ విద్య అందరి హక్కుగా మారింది. రాష్ట్రంలో ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేట్టడంతో కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లలోని 25 శాతం సీట్లు పేద పిల్లలకు దక్కుతున్నాయి. మొదటి విడతలో ఇప్పటికే ఎంతో మందిని కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లకు ఎంపిక చేశారు. తాజాగా 6 నుంచి రెండో విడత దరఖాస్తులకు అవకాశం కల్పిస్తున్నారు.

95 మందికి అడ్మిషన్లు..

జిల్లా పరిధిలోని 32 మండలాల చెందిన 291 ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచిత నిర్బంధ విద్యను అమలు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. మొదటి విడతలో భాగంగా ఉచిత విద్యకు 141 మంది దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు పరిశీలించి 108 మందిని అర్హులుగా గుర్తించి లాటరీ ద్వారా వివిధ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించారు. ఇందులో 95 మంది తమకు కేటాయించిన పాఠశాలల్లో ప్రవేశాలు తీసుకున్నారు. 13 మంది వివిధ కారణాల వల్ల ప్రవేశాలకు అంగీకారం తెలపలేదు. రెండో విడత ప్రవేశాలకు ఈనెల 6 నుంచి రెండో విడత ప్రవేశాల ప్రక్రియను ప్రారంభించేందుకు పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

రిజర్వేషన్ల అమలు ఇలా....

ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం అమలులో భాగం కార్పొరేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించే క్రమంలో అడ్మిషన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం రిజర్వేషన్లను అమలు చేస్తోంది. 10 శాతం ఎస్సీలకు, దివ్యాంగులకు 5 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, ఈబీసీలకు 6 శాతం సీట్లు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఓసీల్లో వార్షిక ఆదాయం రూ.1.20 లక్షల కంటే తక్కువ, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షల కంటే తక్కువ ఆదాయం వారు రిజర్వేషన్‌కు అర్హులుగా నిర్ధారించారు.

'అమ్మఒడి' ద్వారా ఫీజుల చెల్లింపు..

ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలలో ప్రభుత్వ సిఫార్సుల మేరకు 1వ తరగతిలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు అమ్మఒడి పథకం ద్వారా నిర్ధారించిన మేరకు ఫీజును ప్రభుత్వమే చెల్లించనుంది. దీంతో విద్యార్థులు నయాపైసా కూడా పాఠశాలకు చెల్లించకుండా పూర్తి ఉచితంగా విద్యను పొందవచ్చు. అయితే ఈ విద్యార్థుల నుంచి ఎంత ఫీజు వసూలు చేయాలి అనేదానిపై ఇప్పటికే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ఆదేశాలు జారీ చేసింది. అర్బన్ ప్రాంతాలలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి రూ.8 వేలు, గ్రామీణ ప్రాంతాలలో రూ.6,500, గిరిజన, షెడ్యూల్ ప్రాంతాలలో రూ.5,100 ఏడాదికి చెల్లించేలా ఆదేశాలు జారీ చేసింది. ఈ ఫీజును అమ్మఒడి పథకం ద్వారా ప్రభుత్వమే పాఠశాలలకు చెల్లిస్తుంది. గతంలో కార్పొరేట్ పాఠశాలల్లో యాజమాన్యాలు నిర్ణయించే అధిక ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు నానా అవస్థలు పడేవారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంతో తల్లిదండ్రులపై ఫీజులు భారం పూర్తిగా తగ్గిపోనుంది.

రెండో విడత దరఖాస్తుల ఆహ్వానం..

ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ద్వారా కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఈనెల 6 నుంచి రెండో విడత అడ్మిషన్లకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఆసక్తి కలిగిన వారు www.cse.ap.gov.in/ RTE పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. 16 నుంచి 20 వరకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను వారి సచివాలయ సిబ్బంది విచారణ చేసి అర్హుల జాబితా రూపొందించి విద్యాశాఖకు అందజేస్తారు. 24 నుంచి 28 వరకు రెండో విడత లాటరీ ద్వారా ఎంపిక చేసిన విద్యార్థులకు పాఠశాలల్లో ప్రవేశాలను కల్పిస్తారు.

మొదటి విడత అడ్మిషన్ల వివరాలు	
దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య	141
అర్హులుగా తేల్చింది	108
ప్రైవేటు బడుల్లో చేరిన వారి సంఖ్య	95
అడ్మిషన్లు పొందని వారి సంఖ్య	13

సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. పేద విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ విద్యను పొందే అవకాశం కల్పించింది. పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో ఇప్పటికే మొదటి విడత కింద అడ్మిషన్లు పూర్తి చేసి ఆసక్తి కలిగిన 95 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాం. ఈనెల 6 నుంచి రెండో విడత అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి నివసించే చోటుకు కిలోమీటరు దూరంలో ఉండే పాఠశాలను ఎంపిక చేసుకోవాలి. – మీనాక్షి, డీఈఓ

మైనింగ్‌శాఖ జిల్లా అధికారిగా రామ్మోహన్‌రావు



బాధ్యతలు స్వీకరిస్తున్న రామ్మోహన్‌రావు

కొత్తచెరువు: జిల్లా మైనింగ్‌శాఖ అధికారిగా రామ్మోహన్‌రావు బాధ్యతలు స్వీకరించారు. నూతన జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఉమ్మడి జిల్లా నుంచే ఈ శాఖ పరిపాలన నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే ప్రభుత్వం తాజాగా శ్రీసత్యసాయి జిల్లాకు మైనింగ్‌శాఖ అధికారిని నియమించింది.

అశ్వవాహనంపై లక్ష్మీ చెన్నకేశవస్వామి



అశ్వ వాహనంపై కొలువైన లక్ష్మీ చెన్నకేశవస్వామి

ధర్మవరం అర్బన్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదోరోజు లక్ష్మీ చెన్నకేశవస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం సాయంత్రం ప్రధాన అర్చకులు కోనేరాచార్యులు, భానుప్రకాష్‌లు చెన్నకేశవస్వామి మూలవిరాట్‌ను ప్రత్యేక పూలతో అలంకరించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు పుష్ప మంటపంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు వసంతోత్సవం, సాయంత్రం 6 గంటలకు హంస వాహనంపై స్వామి ఊరేగనున్నారు.

వైద్య 'మస్తు'!

నాడు

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆస్పత్రులు అధ్వానంగా ఉండేవి. పీహెచ్‌సీకి వెళ్లే డాక్టర్ ఉంటారో లేదో తెలియదు. ఒకవేళ ఉన్నా మందులుండేవి కావు. వైద్యపరీక్షలు చేసేవారూ కరువు. చిన్న రోగమొచ్చినా ఎక్కడో సుదూరంలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి.

నేడు

గ్రామాల్లోనే వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు ఏర్పటవుతున్నాయి. పీహెచ్‌సీలు కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో రూపుదిద్దుకున్నాయి. నిత్యం ఇద్దరు వైద్యులు ఉంటూ సేవలు అందిస్తున్నారు. గ్రామాలకు 104 వాహనాలు క్రమం తప్పకుండా వస్తున్నాయి. ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రవేశ పెట్టాక పల్లెలకే డాక్టర్లు వస్తున్నారు. గ్రామీణులకు పైసా ఖర్చు లేకుండా ఉన్న ఊర్లోనే వైద్య పరీక్షలు చేస్తున్నారు. 170 రకాల మందులు ఇస్తున్నారు.

విజయవంతంగా ఫ్యామిలీ డాక్టర్

- మారుమూల పల్లెలకూ వైద్యుల రాక
- ఉమ్మడి జిల్లాలో 7 నెలల్లోనే ఐదున్నర లక్షల మందికి లబ్ధి
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రక్తపరీక్షలతో పాటు ఉచితంగా మందులు
- కేన్సర్ బాధితులకు వైద్యంతో పాటు సూచనలు, సలహాలు



చిలమత్తూరు: కొడికొండలో వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

జిల్లాలో 'ఫ్యామిలీ డాక్టర్' సేవలిలా.. (2022 అక్టోబర్- 2023 ఏప్రిల్ గణాంకాలు)	
వైద్యం పొందిన వారు	2,61,466
జనరల్ ఓపీ	1,36,401
యుక్తవయసు వారు	412
గర్భిణులు	22,621
బాలింతలు	11,243
రక్తహీనత బాధితులు	872
హైపర్ టెన్షన్	48,510
మధుమేహం	32,562
మధుమేహం-బీపీ	7,285
ఓరల్ క్యాన్సర్	627
రొమ్ముక్యాన్సర్	137
సర్వైకల్ క్యాన్సర్	783
టీబీ	13

సాక్షి ప్రతినిధి, అనంతపురం: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వైద్య రంగ స్వరూపం పూర్తిగా మారిపోయింది. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న సంకల్పంతో గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఆస్పత్రుల్లో అత్యాధునిక వసతుల సమకూర్చారు. ఈ క్రమంలోనే ఆయన ప్రవేశపెట్టిన 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం పేద రోగులకు వరంగా మారింది. దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో రాష్ట్రంలో అమలవుతున్న ఈ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే డాక్టర్లు వచ్చి పరీక్షలు చేసి రోగులకు మందులు ఇస్తుండడంతో పల్లెప్రజలు మురిసిపోతున్నారు. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, మూర్ఛవ్యాధిగ్రస్తులు.. ఒకరేమిటి రోగులందరికీ ఇంటిదగ్గరే వైద్యం అందుతుండడంతో వారి ఆనందం అంతా ఇంతా కాదు. సుదూరంలో ఉన్న ఆస్పత్రికి ఆటోలోనో, బస్సులోనో అవస్థలు పడుతూ వెళ్లే పరిస్థితి ఉండేదని, ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామాలకే వైద్యులు వస్తుండడంతో నేడు ఆ భారం కూడా తప్పిందని గ్రామీణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి అనంతలో ఐదున్నర లక్షల మందికి..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ విధానం విజయవంతంగా సాగుతోంది. మారుమూల గ్రామాలకూ డాక్టర్లు వెళ్లి రోగులను పలకరిస్తు ఉంటే నిజంగా మన ఊర్లోకే డాక్టర్లు వచ్చారా అన్నంతగా రోగులు ఆశ్చర్యపోతున్నారు. నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కూడా వెళ్లకుండా ఊర్లోకే రావడం వాళ్లు గొప్పగా భావిస్తున్నారు. ఇప్పటివరకూ అనంతపురం జిల్లాలో 2.81 లక్షల మంది, శ్రీ సత్యసాయి జిల్లాలో 2.61 లక్షల మంది ఈ విధానం ద్వారా లబ్ధి పొందారంటే గ్రామీణులకు ఎంతగా ఈ విధానం మేలు చేస్తోందో అర్థం చేసుకోవచ్చు.

జగనన్నకు రుణపడి ఉంటాం



నేను డయాలసిస్ పేషెంట్‌ని. మాలాంటి దీర్ఘ కాలిక వ్యాధిగ్రస్తులకు ఫ్యామిలీ డాక్టర్ విధానం వరం లాంటిది. నిత్యం ఆస్పత్రికి వెళ్లి డాక్టర్ల వద్ద చికిత్స చేయించుకోవాలంటే చాలా కష్టంగా ఉండేది. అయితే ఇప్పుడు డాక్టర్లే ఇంటి వద్దకు వచ్చి పరీక్షిస్తున్నారు. అవసరమైన వారికి చికిత్సతో పాటు మందులను అందజేస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌కి రుణపడి ఉంటాం. – రేషికాభాయి, పరాకువాండ్లపల్లి, తనకల్లు

ఇంటి వద్దే వైద్యం అందుతోంది



నాకు షుగర్ వ్యాధి ఉంది. గతంలో వైద్యం కోసం మండల కేంద్రంలోని ఆస్పత్రికి, లేకపోతే ఆర్‌ఎంపీ వద్దకు వెళ్లే వాళ్లం. దీంతో డబ్బుతో పాటు ఆటోలు లేదా ఏదైనా వాహనం కోసం అవస్థలు పడేదాన్ని. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫ్యామిలీ డాక్టర్‌ను ప్రవేశపెట్టడంతో సంతోషంగా ఉంది. డాక్టర్‌తో పాటు వైద్య సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. కావాల్సిన మందులను కూడా ఇస్తున్నారు. – అక్కమ్మ, ఎం.అగ్రహారం, తాడిమర్రి

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో రీ సర్వే, భూ సేకరణ పనులతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి రీసర్వే, జాతీయ రహదారుల కోసం భూ సేకరణ, హౌసింగ్, రెవెన్యూ, వ్యవసాయ అనుబంధ రంగాలు, పీఆర్‌అండ్‌ఆర్‌డీతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పుట్టపర్తి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, సంబంధిత శాఖల అధికారులు వీసీలో పాల్గొన్నారు. జవహర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరగాలన్నారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్తికరస్థాయిలో అందాలన్న లక్ష్యంతో అధికారులు పని చేయాలన్నారు. ఉపాధి కూలీలకు కూలి సకాలంలో అందేలా చూడాలన్నారు. సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. రీసర్వే పనులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయాలన్నారు. జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి ,విస్తరణ కోసం చేపడుతున్న భూసేకరణ ,పరిహారం పంపిణీ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఎక్కడా తాగునీటి ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, డ్వామా పీడీ రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

అక్రమ రవాణాకు చెక్ పెట్టాలి

గోరంట్ల: స్థానిక పోలీసుస్టేషన్‌ను గురువారం ఎస్పీ మాధవరెడ్డి తనిఖీ చేశారు. మద్యం అక్రమ రవాణా నిరోధానికి , ట్రాఫిక్ సమస్యకు పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను సీఐ సుబ్బరాయుడును అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకాలపాలపై నిఘా ముమ్మరం చేయాలని ఆదేశించారు. ప్రతి గురువారం గోరంట్ల పశువుల సంత నుంచి పాడి ఆవులు, ఎద్దులను హింసాత్మక రీతిలో కబేళాలకు తరలిస్తున్నట్లు కొందరు విలేకరులు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ట్రాఫిక్ సమస్య వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీటిపై ఎస్పీ మాధవరెడ్డి స్పందిస్తూ గోరంట్లలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంతో పాటు పాడి పశువులను ఇష్టానుసారంగా తరలించకుండా చర్యలు చేపడతామన్నారు.

మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు చెప్పండి

అమడగూరు: అక్రమ రవాణాకు పూర్తిగా చెక్‌పెట్టాలని ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆకస్మికంగా ఆయన అమడగూరు పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డుల పరిశీలనతో పాటు కేసుల దర్యాప్తు, కేసు డైరీ, విలేజ్ రోస్టర్, పలు రకాల క్రైం రికార్డులను, లాకప్ గదులను, స్టేషన్ పరిసరాలను, వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. కళాశాలల్లోని విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కర్ణాటక సరిహద్దులో బిళ్లూరు క్రాస్, రామనాథపురంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను పరిశీలించారు. డీఎస్పీ వాసుదేవన్ , ఎస్‌ఐ వెంకటనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



గోరంట్ల: పోలీసుస్టేషన్ పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

ఓడీ చెరువులో క్వార్టర్స్ పరిశీలన

ఓడీ చెరువు: స్థానిక పోలీసుస్టేషన్‌ను ఎస్పీ మాధవరెడ్డి గురువారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్‌ను అడిగి వివరాలను తెలుసుకున్నారు. సిబ్బంది విధి నిర్వహణపై ఎస్పీ ఆరా తీశారు. స్టేషన్ పరిధిలోని సిబ్బంది క్వార్టర్స్‌ను పరిశీలించారు.

వైభవంగా నరసింహస్వామి జయంత్యుత్సవం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవం సందర్భంగా గురువారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. నృసింహ జయంతి సందర్భంగా నృసింహస్వామి గోవింద నామావళి వీడియో సాంగ్‌ను ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు, పాలక మండలి సభ్యులు చేతుల మీదుగా ఆలయ ఆవరణంలో ప్రారంభించారు. గురువారం సాయంత్రం స్వామి వారికి విశేషంగా అలంకరించి శేషవాహనంపై తిరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీవారిని దర్శించుకున్నారు.



అలంకరణలో దర్శనమిస్తున్న ఖాద్రీశుడు

పోక్సో కేసు నమోదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఓ యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు అనంతపురం వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి తెలిపారు. అనంతపురంలో విద్యనభ్యసిస్తున్న ఉరవకొండ ప్రాంతానికి చెందిన ఓ బాలికను కదమలకుంటకు చెందిన సుధీర్ నాలుగు రోజుల క్రితం మభ్య పెట్టి పిలుచుకెళ్లాడు. గురువారం ఉదయం సుధీర్ ఆచూకీ పసిగట్టి అదుపులోకి తీసుకున్న పోలీసులు బాధితురాలి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఇక్కడికి రారు.. అక్కడ ఉండరు

- ఐసీడీఎస్‌లో కాంట్రాక్టు ఉద్యోగుల తీరు
- శ్రీ సత్యసాయి జిల్లా వైపు కన్నెత్తి చూడని వైనం
- అనంతలో పైరవీలు చేస్తూ కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు



అనంతపురంలోని ఐసీడీఎస్ కార్యాలయం

అనంతపురం సెంట్రల్: మహిళా, శిశు సంక్షేమశాఖలో పాలన గాడి తప్పుతోంది. ఆ శాఖలో రెగ్యులర్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులదే పెత్తనంగా మారుతోంది. బాలల హక్కుల పరిరక్షణ సమితి, గృహహింస నిరోధక విభాగం, వన్‌స్టాప్ సెంటర్ తదితర విభాగాల్లో కాంట్రాక్టు కింద సిబ్బంది పనిచేస్తారు. ఇటీవల జిల్లాల పునర్విభజన తర్వాత సగం మందిని ఆ జిల్లాకు బదిలీ చేసినా, నెల గడవకముందే యథాస్థానానికి చేరుకున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా వైపు కన్నెత్తి చూడడం లేదు. ఆ జిల్లాతో తమకు సంబంధం లేదన్న చందంగా వ్యవహరిస్తున్నారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల కట్టడి విషయంలో బాలల హక్కుల పరిరక్షణ సమితి కీలకంగా పని చేయాల్సి ఉంటుంది. గ్రామీణ, మండల స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పిస్తూ మహిళా, శిశుసంక్షేమం విషయంలో కీలకపాత్ర పోషించాల్సి ఉంది. కానీ ఉమ్మడి జిల్లాలో ఆ పరిస్థితి కనిపించడం లేదు.

నామమాత్రంగా సమావేశాలు..

జిల్లా సరిహద్దు మండలాల్లో ఇప్పటికీ మూఢ నమ్మకాలు పాటిస్తున్నారు. బాలికలను బసివినులుగా మారుస్తున్నారు. ఇటీవల రాయదుర్గం నియోజకవర్గంలో ఇలాంటి ఉదంతం వెలుగుచూసింది. బాల్య వివాహాలు కూడా అధికంగా జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించి దురాచారాలను దూరం చేయాల్సిన ఐసీడీఎస్ అధికారులు కేవలం జిల్లా కేంద్రం, తప్పితే పరిసర ప్రాంతాల్లోనే సమావేశాలు నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నారు.

ముఖ్య అధికారి నిర్లక్ష్యం..

గతంతో పోలిస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఐసీడీఎస్ చాలా బలోపేతమైంది. అన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు. ఖాళీలను తరచూ భర్తీ చేస్తున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామానికో మహిళా పోలీసు కార్యకర్త పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఇన్ని చర్యలు తీసుకుంటున్నా, క్షేత్రస్థాయిలో కొందరి అలసత్వం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఆ తరహాలోనే జిల్లా ఇన్‌చార్జ్ అధికారి కూడా ఓ కాంట్రాక్టు ఉద్యోగికి పెత్తనమంతా కట్టబెట్టడంతో వ్యవస్థకు మచ్చ తెస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతోనే శ్రీ సత్యసాయి జిల్లాను కూడా సమన్వయం చేసుకుని పనిచేయాల్సిన కాంట్రాక్టు ఉద్యోగులు జిల్లా కేంద్రంలో తిష్టవేసి పైరవీలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అనాథలు, నిరాశ్రయులైన చిన్నారులకు ప్రతి నెలా ఆర్థికసాయాన్ని అందించేందుకు మిషన్ వాత్సల్య అనే బృహత్తర పథకం తీసుకొచ్చింది. అయితే, ప్రచారం లేకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మంది ఈ పథకానికి దూరమవుతున్నారని తెలిసింది.

అవగాహన సదస్సులు లేకపోవడం వాస్తవమే

జిల్లాల పునర్విభజన తర్వాత ఐసీడీఎస్‌లో 50 శాతం సిబ్బందిని శ్రీ సత్యసాయి జిల్లాకు కేటాయించారు. తర్వాత కొన్ని కారణాల రీత్యా వారిని పాత జిల్లాలో ఉండమని చెప్పారు. విధులు మాత్రం రెండు జిల్లాల్లో నిర్వర్తించాల్సి ఉంది. ప్రభుత్వ కార్యక్రమాలు, రక్షణ చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించపోవడం వాస్తవమే. దీనిపై చర్చించి చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీకుమారీ, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్, శ్రీసత్యసాయి జిల్లా

కొండూరు మల్లికార్జున ఆకస్మిక మృతి


మల్లికార్జున (ఫైల్)

లేపాక్షి: వైఎస్సార్‌సీపీ నేత, హిందూపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కొండూరు మల్లికార్జున (58) గుండెపోటుతో మృతి చెందారు. గురువారం ఉదయం లేపాక్షిలోని ఆర్‌జేహెచ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జరిగిన బసవ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బస్టాండు నుంచి ఫంక్షన్ హాల్ వరకూ నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం సభావేదికపై ఆసీనులై ఉండగా.. ఉన్నఫళంగా అస్వస్థతకు గురవడంతో వెంటనే లేపాక్షి పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు... ఆయన గుండెపోటుకు గురయ్యారని నిర్ధారించారు. వైద్యుల సూచన మేరకు హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆయన మృతి చెందారు. సాయంత్రం ఆయన మృతదేహాన్ని కొండూరుకు తీసుకువచ్చారు. మృతుడికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, మల్లికార్జున 2001లో కల్లూరు ఎంపీటీసీ సభ్యుడిగా గెలుపొంది లేపాక్షి ఎంపీపీగా విశిష్ట సేవలను అందించారు. 2003లో తన పదవికి రాజీనామా చేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ చేరారు. టీడీపీకి కంచుకోటగా ఉన్న హిందూపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శ్రమించారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం 2021లో హిందూపురం మార్కెట్ యార్డు చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించి సముచిత స్థానం కల్పించింది.

విద్యుదాఘాతంతో బళ్లారి వాసి మృతి

ఉరవకొండ: విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండలోని శివరామిరెడ్డి కాలనీకి చెందిన నారాయణ తన కొత్త ఇంటికి పెయింటింగ్ వేసేందుకు బళ్లారికి చెందిన పెద్దన్న (45)కు కాంట్రాక్ట్ ఇచ్చాడు. ఈ క్రమంలో నాలుగు రోజులుగా నారాయణ ఇంటికి పెయింట్ వేసే పనిలో పెద్దన్న నిమగ్నమయ్యాడు. గురువారం ఉదయం మిద్దెకు సమీపంలో వెళుతున్న 11 కేవీ విద్యుత్ తీగల వద్ద పెయింటింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు చేతిలో ఉన్న రోలర్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. వరలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి

యల్లనూరు: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్‌లు వేసేందుకు ప్రయత్నించిన ఓ రైతు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... యల్లనూరు మండలం శింగవరం గ్రామానికి చెందిన శింగనమల షరీఫ్ (50)కు భార్య, నలుగురు పిల్లలున్నారు. తనకున్న పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ఉదయం పొలానికి వెళ్లిన షరీఫ్.. అక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎగిరిపోయిన ఎగ్జిట్ ఫ్యూజ్‌లు గుర్తించి, వేస్తుండగా షాక్‌కు గురై కుప్పకూలాడు. అపస్మారకస్థితిలో పడి ఉన్న షరీఫ్‌ను చుట్టుపక్కల రైతులు గుర్తించి, కుటుంబసభ్యులతో కలసి పులివెందులలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బాబుకు జైలు శిక్ష తప్పదు

- ఎమ్మెల్యే తిప్పేస్వామి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: అధికారాన్ని అడ్డుపెట్టుకుని దోపిడీ పాలన సాగించిన నారా చంద్రబాబు జైలుకు వెళ్లడం ఖాయమని మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అన్నారు. గురువారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతిలో భూకుంభకోణాలు, భారీ ప్రాజెక్టుల్లో అవకతవకలు, రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పు వంటి అంశాలకు సంబంధించి సిట్ దర్యాప్తుపై హైకోర్టు ఇచ్చిన స్టే ను సుప్రీంకోర్టు కొట్టివేయడంపై హర్షం వ్యక్తం చేశారు. సుప్రీం తీర్పుతో న్యాయవ్యవస్థపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు అనేక భూకుంభకోణాలు జరిగాయన్నారు. వాటిపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించిందని గుర్తు చేశారు. ఈ విషయం గిట్టని చంద్రబాబు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నాడన్నారు. తాజాగా ఈ స్టే ను సుప్రీం కోర్టు ఎత్తివేయడంతో చంద్రబాబు అక్రమాలపై విచారణకు అవకాశం ఏర్పడిందన్నారు. ఈ కుంభకోణాల్లో వెలుగులోకి రాగానే చంద్రబాబు జైలుకెళ్లడం ఖాయమన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ ఇంత కాలం తప్పించుకు తిరుగుతున్న చంద్రబాబు శిక్ష నుంచి ఎంత మాత్రం తప్పించుకోలేడని అన్నారు.

సరిహద్దున పోలీస్ నిఘా

- అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా ఎస్పీ మాధవరెడ్డి చర్యలు


తూముకుంట చెక్‌పోస్టులో పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి (ఫైల్)

కొత్తచెరువు: జిల్లాలో అక్రమంగా మత్తు పదార్థాలు ప్రవేశించకుండా ఎస్పీ మాధవరెడ్డి పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలోని జిల్లాలోని కర్ణాటక సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక నిఘా పెంచారు. కర్ణాటకకు ఆనుకుని ఉండడంతో జిల్లా మీదుగా కర్ణాటక మద్యం, గుట్కా, గంజాయి అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. వివిధ మార్గాల్లో పోలీసుల కళ్లు గప్పి అక్రమార్కులు వీటిని చేరవేస్తున్నారు. ఇందుకు సహకరించిన చెక్‌పోస్టుల్లోని సిబ్బందికి భారీగా నజారానాలు సైతం ముట్టజెబుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారుల ఒత్తిడి ఉన్నప్పుడు మాత్రమే నామమాత్రపు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నట్లు సమాచారం.

అక్రమ రవాణాపై ఉక్కుపాదం..

జిల్లా ఎస్పీగా మాధవరెడ్డి బాధ్యతలు స్వీకరించిన అనతి కాలంలోనే అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపారు. అన్ని సబ్ డివిజన్లను ఆకస్మిక తనిఖీ చేస్తూ బద్ధకస్తులైన సిబ్బంది వెన్నులో వణుకు పుట్టిస్తున్నారు. ఈ క్రమంలోనే కర్ణాటక నుంచి అక్రమంగా జిల్లాలోకి గంజాయి, గుట్కా, మద్యం రవాణా కాకుండా సరిహద్దుల్లో నిఘా పటిష్టం చేశారు. కర్ణాటక నుంచి ఆంధ్రలోకి ఏ వాహనాలు వస్తున్నాయి? రిజిస్ట్రేషన్ నంబర్ల ఆధారంగా ఏ రాష్ట్రానికి చెందిన వాహనాల్లో ఎలాంటి సరుకు రవాణా చేస్తున్నారనే అంశాలను పరిగణలోకి తీసుకుని అక్రమంగా సరుకు రవాణా చేస్తున్న రాష్ట్రాలకు చెందిన వాహనాలు గుర్తించారు. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాలకు చెందిన ఏ వాహనమైన చెక్‌పోస్టులోకి చేరుకోగానే క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే జిల్లాలోకి అనుమతిస్తున్నారు. ఈ విషయంగా నిర్లక్ష్యంగా వ్యవహరించే పోలీసు అధికారి ఏ స్థాయిలో ఉన్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు.

అన్ని నియోజకవర్గాలు సరిహద్దుల్లోనే..

జిల్లాలోని నియోజకవర్గాల్లో ధర్మవరం మినహా అన్ని నియోజకవర్గాలు కర్ణాటక సరిహద్దులోనే ఉన్నాయి. కదిరి, పుట్టపర్తి, హిందూపురం, పెనుకొండ, మడకశిర, రాప్తాడు నియోజకవర్గాలోని 16 మండలాలు కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని ఉన్నాయి. ఈ మండలాల మీదుగా జిల్లాలోకి కర్ణాటక మద్యం, గుట్కా యథేచ్ఛగా ప్రవేశిస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి గుర్తించి, ఆయా ప్రాంతాల్లోని చెక్‌పోస్టులను ఇటీవల ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రతి చెక్‌పోస్టులో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఎనిమిది మంది కానిస్టేబుళ్లతో పాటు ఐదు మొబైల్ పార్టీలను ఏర్పాటు చేశారు. ఎస్పీ చర్యలతో అక్రమ రవాణా కాస్త నెమ్మదించింది.

పాఠకులకు మెరుగైన సౌకర్యాలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి


గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న ఉమామోహన్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం పుట్టపర్తిలోని గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, సౌకర్యాలపై పాఠకులతో ఆరా తీశారు. త్వరలో పాఠకులకు డిజిటల్ లైబ్రరీ అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని పుస్తకాలు సమకూరుస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి గిరి ప్రదక్షిణ


సత్యసాయి గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం సత్యసాయి గిరి ప్రదక్షిణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ప్రశాంతి నిలయంలోని గణేష్ గేట్ వద్ద సత్యసాయి చిత్రపటాన్ని ఉంచిన పల్లకీకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేశవిదేశాలకు చెందిన భక్తులు గిరిప్రదక్షిణ చేశారు.

సందడిగా దుర్గమ్మ పరుష


వెండి కవచ అలంకరణలో దర్శనమిస్తున్న దుర్గమ్మ దేవత

ధర్మవరం అర్బన్: స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామి రథోత్సవం ముగిసిన అనంతరం మూడు రోజుల పాటు నిర్వహించే దుర్గమ్మ పరుష గురువారం సందడిగా ప్రారంభమైంది. ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని దీపాలు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన రహదారిపై వెలిసిన వందలాది దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

రైతు భరోసా కేంద్రాలు కీలకం


మాట్లాడుతున్న సెరికల్చర్ జేడీఏ పద్మమ్మ

హిందూపురం టౌన్: పంటల విషయంలో సలహాలు, సూచనలు అందించడంలో రైతు భరోసా కేంద్రాలు కీలకమని, ఆర్బీకేల్లో సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలని సెరికల్చర్ జేడీఏ పద్మమ్మ, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రవికిశోర్ తెలిపారు. గురువారం స్థానిక సెరికల్చర్ ఏడీఏ రైతు శిక్షణ కేంద్రంలో డివిజన్ పరిధిలోని రైతు భరోసా కేంద్రం సహాయకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ విద్యావతి, సనావుల్లా, అల్తాఫ్ అలీఖాన్, సిరికల్చర్ ఏడీఏ సురేష్, ఐఎఫ్ఎఫ్‌సీఓ మేనేజర్‌లు పాల్గొని వివిధ అంశాలపై మాట్లాడారు.

ప్రశాంతి నిలయంలో ఘనంగా బుద్ధ పౌర్ణమి


సాయికుల్వంత్ మందిరంలో ప్రార్థనలు చేస్తున్న బౌద్ధ గురువులు

ప్రశాంతి నిలయం: బుద్ధ పౌర్ణమి వేడుకలు ప్రశాంతి నిలయంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకరరాజు జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. సాయికుల్వంత్ సభా మందిరంలో బౌద్ధ గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సత్యసాయి మహాసమాధి వద్ద బౌద్ధ సంప్రదాయంలో పూజలు నిర్వహించారు. పలువురు బౌద్ధ ప్రముఖులు మాట్లాడుతూ.. సత్యసాయికి, బుద్ధ భగవానునికి మధ్య సారూప్యతను వివరించారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలతో కళాకారులు ఆకట్టుకున్నారు.

కల్వర్టులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గోరంట్ల: మండలంలోని బుడ్డపల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న కల్వర్టులో గురువారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ సుబ్బరాయుడు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దాదాపు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తిగా అంచనా వేశారు. బ్లూజీన్స్ ప్యాంటు, పాచి కలర్ ఫుల్‌హ్యాండ్స్ టీ షర్టు ధరించాడు. మృతదేహం ఉబ్బిపోయి గుర్తు పట్టలేని విధంగా ఉంది. నాలుగైదు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే గోరంట్ల పోలీసులను సంప్రదించాలని సీఐ సుబ్బరాయుడు కోరారు.

జిల్లాలో బౌద్ధమత ఆనవాళ్లు


పీస్ మెమోరియల్ హాలులో భద్రపరిచిన క్రీ.శ. 3వ శతాబ్దం నాటి బుద్ధుడి విగ్రహం


యర్రగుడి వద్ద బౌద్ధ మత శాసనమున్న ప్రాంతం

అనంతపురం కల్చరల్: బుద్ధం శరణం గచ్ఛామి.. సంఘం శరణం గచ్ఛామి అంటూ శాంతికి ప్రతిరూపమైన గౌతమ బుద్ధుడి ఆనవాళ్లు అనంతపురం జిల్లాలోనూ ఉన్నాయి. శతాబ్దాల క్రితం నాటి బుద్ధుడి స్మృతి చిహ్నాలను దశాబ్దాల క్రితమే జిల్లా చరిత్ర కారులు వెలుగులోకి తెచ్చారు. సిద్ధార్థుడిగా ప్రారంభమైన ఆయన జీవితం ఎన్నో సందేహాలతో తపోధనుడై.. తథాగతుడిగా మారిన తర్వాత ధార్మిక, ఆధ్యాత్మిక వెలుగులు విరజిమ్ముతూ ప్రపంచాన్ని శాంతి మార్గం వైపు గౌతమబుద్ధుడి జయంతిని శుక్రవారం జిల్లాలోనూ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

గుత్తి సమీపంలో శాసనాలు..

జిల్లాలోనూ బౌద్ధ మతం వ్యాప్తి చెందిందనేందుకు జిల్లా సరిహద్దుకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో లభ్యమైన పురాతన శాసనాలే నిదర్శనం. గుత్తి పట్టణ సమీపంలోని యర్రగుడి, కర్నూలు జిల్లాలోని జొన్నగిరి వద్ద లభ్యమైన అశోకుడి కాలం నాటి శిలా శాసనాల్లో బుద్ధిడి బోధనలు స్పష్టంగా పేర్కొన్నారు. బ్రాహ్మి లిపిలో పెద్ద రాతి బండలపై లిఖించిన శాసనాల్లో బుద్ధుడి సూక్తులున్నట్లు పరిశోధకులు కనుగొన్నారు.

బుద్ధుని ప్రతిరూపాలు..

'మహాబోధి సాహిత్య వేదిక'ను ప్రారంభించిన దాసన్నగారి కృష్ణమూర్తి... బౌద్ధ అనుయాయులతో కలసి అనంతపురంలోని హౌసింగ్‌బోర్డులో బుద్ధ విహార్ ప్రాజెక్టు నేతృత్వంలో బౌద్ధ ధర్మాన్ని చాటుతున్నారు. 2019లో బుద్ధ పార్కు ఏర్పాటు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో బుద్ధుడి సమగ్ర సమాచారంతో కూడిన ఎన్నో పుస్తకాలున్నాయి. అలాగే నగరంలోని పీస్ మెమోరియల్ హాలులోకి అడుగు పెట్టగానే నిలువెత్తు బుద్ధుని చరిత్ర తెలిపే పెయింటింగ్స్, తవ్వకాల్లో బయటపడిన క్రీ.శ.3వ శతాబ్దం నాటి విగ్రహం ఆకట్టుకుంటాయి.

నేడు బుద్ధ వందనం..

బుద్ధ జయంతిని పురస్కరించుకుని బుద్ధ విహార్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నగరంలోని బుద్ధ పార్కులో బుద్ధ వందనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బుద్ధుడి జీవితంపై ప్రసంగం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. వైశాఖ పౌర్ణమి కావడంతో పలు ఆలయాల్లోనూ విశేష పూజలు జరుగనున్నాయి.